
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

సోమవారం 18 మార్చి 2024




ఇఫ్తార్ | 6:32 సోమవారం

సహర్ | 5:00 మంగళవారం

నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉన్నందున ఈనెల 18వ తేదీన నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ప్రకటలో కోరారు.



నేడు జగిత్యాలకు ప్రధాని మోదీ రాక

- జిల్లా కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభకు హాజరు
- ఎస్‌పీజీ పర్యవేక్షణలో హెలిప్యాడ్, సభాప్రాంగణం
- సభకు భారీ ఏర్పాట్లు...జన సమీకరణలో కమలనాథులు

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 18వ తేదీన జగిత్యాలకు రానున్నారు. జిల్లా కేంద్రంలో హౌసింగ్ బోర్డు సమీపంలో గల గీతా విద్యాలయం మైదానంలో నిర్వహించనున్న బీజేపీ భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా బహిరంగ సభకు భారీ ఎత్తున జనాన్ని సమీకరించే పనిలో బీజేపీ నేతలు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఎంపీ ధర్మపురి అర్వింద్, జిల్లా అధ్యక్షుడు మైడిపల్లి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్, బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రావు సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. నిజామాబాద్, కరీంనగర్ ఎంపీలు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, పెద్దపల్లి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోమాత శ్రీనివాస్ జన సమీకరణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

● హామీలపై ఆశలు...

లోకసభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులుగా ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, గోమాత శ్రీనివాస్‌లను బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. దీంతో పాటు ఎన్నికల ప్రచారాన్ని సైతం ప్రారంభించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే రంగంలోకి దిగి ఎన్నికల ప్రచార శంఖారావం పూరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జగిత్యాలలో నిర్వహించనున్న మోదీ బహిరంగ సభపై భారీ అంచనాలున్నాయి. ఈ సభా వేదికగా జగిత్యాలకు స్పష్టమైన హామీలు, ఎన్నికల నజరానాలు ప్రకటించే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. ప్రధానంగా కేంద్రం పరిధిలో ఉన్న మామిడి బోర్డు, జాతీయ రహదారుల అభివృద్ధి, రైల్వేలైన్ అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలపై హామీలు గుప్పించనున్నట్లు తెలుస్తోంది. యువత, మహిళలకు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హామీ లభిస్తుందని జిల్లా వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● జన సమీకరణకు ఏర్పాట్లు...

ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో భారీ ఎత్తున జన సమీకరణపై బీజేపీ దృష్టి సారించింది. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు పెద్దపల్లి, కరీంనగర్, ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలను ప్రజలను తరలించి సత్తాచాటాలని చూస్తోంది. సభా ప్రాంగణంలో సుమారు 40 వేల కుర్చీలను ఏర్పాటు చేస్తున్నారు. మరో అరవై వేల మంది నిలబడి మోదీ ప్రసంగాన్ని వినేలా కమలనాథులు శ్రమిస్తున్నారు. ప్రధానంగా మహిళలు, యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ప్రధానీ మోదీ సభ ద్వారా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాలోని పార్లమెంట్ నియోజకవర్గాల్లో తమ అభ్యర్థుల గెలుపును సుగమం చేసుకోవాలని, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని బీజేపీ బావిస్తోంది.

● సభా ప్రాంగణం తనిఖీ...

జగిత్యాలలో ప్రధానీ మోదీ పర్యటన నేపథ్యంలో ఎస్‌పీజీ బృందంతో పాటు స్థానిక పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. బహిరంగ సభ ప్రాంగణంలో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. సభా వేదికను క్షుణంగా తనిఖీ చేయడంతో పాటు స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. సభా ప్రాంగణం చుట్టు పక్కల గల ఎత్తయిన భవనాలు, నివాసాల్లో సైతం అధికారులు సోదాలు చేశారు. సిలెండర్లు, పేలుడు పదార్థాలు సమీపాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సభా ప్రాంగణం చుట్టు పక్కల భవనాల్లో నివాసం ఉంటున్న వారి వివరాలను సైతం ఎస్‌పీజీ అధికారులు సేకరించారు. నివాసం ఉంటున్న వారి పేర్లతో పాటు ఆధార్ కార్డు, ఇతర వివరాలను సైతం ఎస్‌పీజీ అధికారులు సేకరించినట్లు స్థానికులు వివరిస్తున్నారు.



డాగ్ స్క్వాడ్‌తో సభా ప్రాంగణం పరిశీలన

● ట్రాఫిక్ ఆంక్షలు...

మోదీ పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీసన్ ప్రీత్ సింగ్ ప్రకటించారు. కరీంనగర్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలు ధరూర్ కెనాల్ నుంచి బైపాస్ ద్వారా కోరుట్ల వైపు వెళ్లాలి. నిజామాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి బైపాస్ ద్వారా ధరూర్ కెనాల్ మీదుగా వెళ్లాలి. ధర్మపురి నుండి కరీంనగర్ వైపు వెళ్లేవారు తమ వాహనాలను జగిత్యాల రూరల్ మండలం పొలాస నుండి తిమ్మాపూర్ బైపాస్ మీదుగా ధరూర్ కెనాల్ మీదుగా వెళ్లవలసి ఉంటుంది. కరీంనగర్ నుండి ధర్మపురి వైపు వెళ్లేవారు తమ వాహనాలను ధరూర్ కెనాల్ మీదుగా తిమ్మాపూర్ బైపాస్ మీదుగా పోలాస గ్రామం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ధర్మపురి నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలను జగిత్యాల రూరల్ మండలం పొలాస నుంచి తిమ్మాపూర్ బైపాస్ మీదుగా ధరూర్ కెనాల్ మీదుగా బైపాస్ రోడ్‌లో కోరుట్ల వైపు వెళ్లేలా దారి మల్లించారు.

● పోలీసు ప్రధాన కార్యాలయ గ్రౌండ్‌లో హెలీప్యాడ్...

జగిత్యాల పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయ గ్రౌండ్‌లో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరుకున్న కేంద్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారుల ఆదేశాలకు అనుగుణంగా స్థానిక నేతలు, పోలీసు అధికారులు హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. ప్రధాని మోదీ కోసం మూడు హెలి ప్యాడ్‌లను సిద్దం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక పికెట్లను, క్లస్టర్లను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

● పోలీసుల అసాధారణ భద్రత...

ప్రధాని బహిరంగ సభకు అసాధారణ భద్రతను పోలీసులు నిర్వహిస్తున్నారు. సుమారు ఏడుగురు ఎస్‌పీ స్థాయి అధికారులతో పాటు సభకు దాదాపు ఎనిమిది జిల్లాల నుంచి 1,600 మంది అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. బందోబస్తును సెక్టార్ల వారిగా విభజించి ఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులను బాధ్యులుగా నియమించారు. అధికారులకు తమకు కేటాయించిన విధులను పూర్తి అప్రమత్తతతో, ఐడీ కార్డులను తప్పనిసరిగా ధరిస్తూ విధులు నిర్వహించనున్నారు. హెలిప్యాడ్ వద్ద విధులు నిర్వహించే అధికారులు ఎవరిని రానివ్వకుండా అలర్ట్‌గా ఉంచుతున్నారు.

● డ్రోన్లపై నిషేధం..

ప్రధాన మోదీ పర్యటన నేపథ్యంలో జగిత్యాలలో డ్రోన్లపై ఎస్‌పీ సన్ ప్రీత్ సింగ్ నిషేధం విధించారు. వీటితో పాటు పారాగ్లైడర్ల సంచారం, చిన్నపాటి ఎయిర్ క్రాఫ్టులు ఎగరవేయవద్దని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. డ్రోన్లు ఎగురవేస్తే గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అనధికారికంగా డ్రోన్లు ఎగరేస్తే డేగలు గుర్తించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

● పార్కింగ్‌లు ఇక్కడే...

నిజామాబాద్, కోరుట్ల, రాయికల్ నుంచి వచ్చే వారు లింగంపేట రోడ్డు, బీట్ బజార్, మార్కెట్ యార్డులో తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్ వైపు నుంచి వారు మెడికల్ కళాశాల, ఎగ్జిబిషన్ గ్రౌండ్, ధర్మశాల పార్కింగ్ స్థలాలను తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. ధర్మపురి, సారంగపూర్, గొల్లపల్లి వైపు నుంచి వచ్చే వారు ఓల్డ్ బస్టాండ్ వద్ద గల మినిస్టేడియంలో తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. జగిత్యాలకు వచ్చే వాహనాదారులు ముందుగా తెలిపిన ట్రాఫిక్, పార్కింగ్ అంశాలను గమనించి పోలీసు అధికారులకు సహకరించాలని కోరుతున్నారు.

మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



పీఎం సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో నిర్వహించనున్న బీజేపీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. ఆదివారం పట్టణంలో గీతా విద్యాలయం మైదానంలో జరుగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యకర్తలు, నాయకులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న కుర్చీలు, బారికేడ్లు, వేదిక తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 18వ తేదీన పీఎం నరేంద్ర మోదీ హాజరు కానున్న భారీ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నిర్వహిస్తున్న ప్రచార సభకు పీఎం మోదీ హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మైడిపల్లి సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి ప్రవీణ్‌లతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలి

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరికల కార్యక్రమం ఆదివారం కొనసాగింది. రాయికల్ మండలంలోని చింతలూర్, జిల్లా కేంద్రం లోని 14వ, వార్డు, జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్, మోరపెల్లి, రఘు రాముల కోట, 8వ, వార్డులోని గోత్రాల కాలనీకి చెందిన సుమారు 500 మందికి పైగా కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్సీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, నాయకులు ఈదుల లక్ష్మణ్, నర్సయ్య, వెంకటి, ఎల్లయ్య, రాజం, జహీర్, రంజిత్, సత్తమ్మ, రాజేందర్, మునీందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, కౌన్సిలర్ మల్లవ్వ ఉన్నారు.

నరేంద్ర మోదీ పర్యటనను అడ్డుకుంటాం

భీమారం, మార్చి 17: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జగిత్యాల పర్యటనను అడ్డుకుంటామని రాష్ట్ర మాల మహానాడు ఉపాధ్యక్షుడు ఉరుమడ్ల లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తామని మోదీ మాట తప్పారని, స్వేచ్ఛ సౌభ్రాతృత్వం, సమానత్వం, భిన్నత్వంలో ఏకత్వం అనే మోదీ కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు అడగడానికి రావడాన్ని ఖండిస్తున్నామని అన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గొల్లపల్లి మండలం రాఘవపట్నంకు చెందిన సంఘ శ్రీనివాస్ (35) అను యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లిన శ్రీనివాస్ ఇటీవల తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. వివాహ విషయంలో ఆలస్యం చోటుచేసుకుంటుండడంతో మనస్తాపానికి గురయిన శ్రీనివాస్ ఈనెల 16వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. విషయం గమనించిన ఇరుగు పొరుగు, కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌ను ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు శ్రీనివాస్ తల్లి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సతీష్ తెలిపారు.

వృద్ధాశ్రామానికి విద్యార్థుల విరాళం



వృద్ధాశ్రామానికి విరాళం అందిస్తున్న దాతలు

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్ట రాజేశ్వర స్వామి ఆలయం సమీపంలో గల శివ గాయాత్రి అనాథ వృద్ధాశ్రామానికి ప్రభుత్వ పోర్ట్ హైస్కూల్‌లో చదువుతున్న ఉర్దుమీడియం 8వ తరగతి విద్యార్థులు ఆదివారం విరాళం అందజేశారు. అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివ శంకర్‌ను కలిసి రూ. 5 వేల విరాళాన్ని అందించారు. వృద్ధులకు పండ్ల పంపిణీ జరిపారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే సేవా భావంతో ఉండడం హర్షణీయమని విద్యార్థులను ఆశ్రమ నిర్వాహకుడు శివ శంకర్ అభినందించారు. నవమోసాలు మోసి, కనిపెంచిన తల్లిదండ్రులను రోడ్డుపై వదిలివేస్తున్న ఈ రోజుల్లో అనాథలను చేరదీసి ఆలనాపాలనా చూపుకుంటున్న ఆశ్రమ నిర్వాహకులు శివ శంకర్‌ను ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ సమీరోద్దీన్, అస్మా కౌసర్, ఖాసియా, ఫాతిమాలతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసిన పసుపు




మార్కెట్‌లో తడిసిన పసుపు పంట

మెట్‌పల్లి రూరల్, మార్చి, 17 : మెట్‌పల్లి, మండలంలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో రైతుల గుండెల్లో ఉరుములు మెరిశాయి. ఆదివారం వాతావరణంలో మార్పులు వచ్చి మళ్లీ మేఘావృతమైన కమ్ముకొని చిన్నపాటి చినుకులు పడడంతో ఆరుగాలం శ్రమించిన అన్నదాతలను అకాల వర్షాలు వణికిస్తున్నాయి. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పోసిన పసుపు కుప్పలు తడిసింది. వారం రోజులుగా వ్యాపారస్థులు కొనుగోలు చేసిన అరపోసిన పసుపు, తూకం వేసిన సంచులు తడిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం వరి పొట్ట దశకు చేరుకుంది. మరో పదిహేను, ఇరువై రోజుల్లో పంట రైతులకు చేతికందుతుంది. ఈ దశలో చెడగొట్టు వానలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అకాల వర్షాలు కురిస్తే పొలాలు పూర్తిగా దెబ్బతిని పంట చేతికి రాదని, పొట్ట దశలో ఉన్న పంట, నీరు తాగే దశలో ఉన్న పంట దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజయీభవ

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి
- జిల్లా వ్యాప్తంగా 67 కేంద్రాల్లో 11,366 మంది విద్యార్థులు



జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. జిల్లాలో ఇందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా, ఇందులో 64 కేంద్రాలు రెగ్యులర్, 3 కేంద్రాలు ప్రయివేటు కేంద్రాలను గుర్తించారు. జిల్లాలో 11,366 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 5,602 మంది బాలురు, 5,763 మంది బాలికలున్నారు. ప్రయివేటుగా పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు 841 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 67 మంది చీఫ్ సూపరెండెంట్లు, అడిషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్ ఆరుగురు, ఫ్లయింగ్ స్క్వాడ్ నలుగురు, కస్టోడియన్స్ 22 మంది, ఇన్విజిలేటర్లు 702 మంది విధులు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, ప్రతి గదిలో ఫ్యాన్, పర్నిచర్ ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో ఆరోగ్య శాఖ సిబ్బందిని నియమించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం అవసరమైన సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష జరగనుండగా, కేంద్రానికి అరగంట ముందే విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులే కాకుండా ఇన్విజిలేషన్ సిబ్బందితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, ఇతర అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకవెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కొడిమ్యాల: ఈ నెల18 సోమవారం నుంచి ప్రభుత్వం నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఇన్‌చార్జ్ ఎంఈవో ఎ. శ్రీనివాస్ తెలిపారు. మండలంలో కొడిమ్యాల బాలికల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, పూడూర్‌లోని ఉన్నత పాఠశాల మూడు పరీక్ష కేంద్రాలలో 377 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈవో తెలిపారు. సీసీ కెమెరాలను ఏర్పాటు పూర్తయినట్లు తెలిపారు.

కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణంతో పాటు మండలంలో ఈ నెల మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించు పది పరీక్షలకు మండల విద్యాధికారి నరేశం ఉపాధ్యాయులతో కలిసి ఏర్పాట్లను ఆదివారం చేశారు. కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ పరీక్ష కేంద్రాలలో 1477 మంది విద్యార్థులు పరీక్షలలో హాజరు కావడానికి ఏర్పాట్లును చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 240, గౌతమ్ మాడల్ స్కూల్‌లో 200, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 240, గౌతమ్ ఐస్కూల్‌లో 260, ప్రభుత్వ ఐస్కూల్‌లో 160, కేరళ పాఠశాలలో 200, ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో 186 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలో హజరు కావడానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లును చేశారు. అదే విధంగా మండలంలోని అయిలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 48, మాదాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 129 మంది విద్యార్థులు పరీక్షలను హజరు కావడానికి ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ నరేశం తెలిపారు.

కథలాపూర్ : నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షల కోసం మండలంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో ఆనందరావు తెలిపారు. మోడల్ స్కూల్‌లో 292 మంది, గంభీర్‌పూర్ హైస్కూల్‌లో 71, అంబారిపేటలో 61 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. తక్కళ్లపల్లి, బొమ్మెన పాఠశాలలకు చెందిన విద్యార్థులు 34 మంది విద్యార్థులు బీమారం మండలంలోని మన్నెగూడెం కేంద్రంలో పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. పరీక్షల నిర్వాహణ పకడ్బందీగా చేపట్టనున్నామన్నారు.

మల్యాల: నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ తెలిపారు. మండల వ్యాప్తంగా గల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 571 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం మల్యాలలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల, రామన్నపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం..

జగన్ మోహన్ రెడ్డి, జిల్లా విద్యాధికారి



జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నాము. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశాము. విద్యార్థులకు హాల్ టికెట్స్‌లను సైతం పంపిణీ చేశాము. కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులను సమకూర్చుతున్నాము. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటున్నాము.

పరీక్ష సరిగా రాయలేదని యువతి ఆత్మహత్య

జగిత్యాల రూరల్, మార్చి 17: మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన నాగులపల్లి అశ్విత (20) అనే యువతి బీటెక్ రెండో సంవత్సరం సెమిస్టర్ పరీక్ష సరిగా రాయలేదని మనస్తాపానికి గురై ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న అశ్విత ఇటీవల రెండో సెమిస్టర్ పరీక్షలకు హాజరైంది. అనంతరం శివరాత్రి సెలవుల కోసం అంతర్గాం గ్రామానికి వచ్చింది. పరీక్షలు సరిగా రాయలేదని పలు సందర్భాల్లో కుటుంబసభ్యుల వద్ద బాధపడింది. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అశ్విత ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వడగళ్ల వానకు నేలరాలిన మామిడి



గంభీరావుపేటలో రాలిన మామిడి కాయలు, దారిలో విరిగి పడిన చెట్టు

గంభీరావుపేట, మార్చి 17: గంభీరావుపేట మండలంలో కురిసిన వడగళ్ల వానకు వరి పంటతో పాటు మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షంతో చేతుకు వచ్చిన వరి పంటలు దెబ్బతిన్నాయి. మరో 15 రోజుల్లో వరి కోతలు మొదలయ్యే పరిస్థితిలో ఊహించని నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు మామిడి కాయలు రాలి పోయాయి. రహదారుల వెంట చెట్లు నెలకొరిగాయి.

● **వరిపంటకు నష్టం..**

కోనరావుపట: కోనరావుపేట మండలం మరిమడ్లలో శనవారం రాత్రి కురిసన వడగండ్ల వానతో వరిపంట దెబ్బతిన్నాయి. వరిపంటలు పోట్టకు వచ్చిన దశలో వడగండ్ల వాన వల్ల వరిపంటలు దెబ్బతినడం వల్ల రైతులు నష్టపోయో పరిస్థితి ఎర్పడింది. సుమారు మరిమడ్లలో పది ఎకరాల వరకు వరి పంటలు దెబ్బతిన్నయి.



మరిమడ్లలో నేలవాలిన వడ్లు

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి

కోరుట్ల రూరల్, మార్చి 17: మండలంలోని సంగెం గ్రామ శివారులోని వాగులో చేపలు పడుతుండగా యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో వాగులో యువకులు చేపల వేట చేస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం సమయంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు చేపల వేట కోసం వెళ్లారు. చేపలను విద్యుత్ షాక్ సహాయంతో పడుతుంటారు. ఈక్రమంలో పట్టుకున్న చేపలను తేవడానికి నీటిలోకి వెళ్లిన రాయుడి(35) విద్యుదాఘాదానికి గురై మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రాయుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి మత్స్యకారుడు..

మెట్‌పల్లి, మార్చి, 17: పట్టణానికి చెందిన దీటి శంకర్(48) అను మత్స్యకారుడు ఆదివారం చెరువులో చేపలు పట్టుతుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివారల ప్రకారం.. పట్టణానికి చెందిన శంకర్ చేపలను పట్టుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన రేగుంట గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టడానికి తోటి మత్స్యకారులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో చేపలు పట్టడానికి వేసిన వల కాలుకు చుట్టుకొని చెరువులో మునిగిపోయాడు. గమనించిన తోటి మత్స్యకారులు శంకర్‌ను బయటకు తీసేసరికి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

మెట్‌పల్లి, మార్చి 17: మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరుపేట గ్రామ బస్టాండ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధినేని భూమక్క(60) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఆరపేటకు చెందిన బాధినేతి భూమక్క, కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన నల్ల లక్ష్మి, శనిగారపు తుక్కవ్వ ఆరపేట బస్టాండ్ బస్సు దిగారు. ముగ్గురు మహిళలు ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా ఏపీ01ఎస్4455 నంబర్ గల కారులో భీమవరం మండలం రాగోజీపేటకు చెందిన సురేష్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ముగ్గురు మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు ప్రత్యేక వాహనంలో మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న బాధినేని భూమక్క ఆదివారం ఉదయం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- ధర్మపురిలో 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహణ




విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయం, క్షేత్రంలోని లక్ష్మీనృసింహ (యోగ) స్వామి వారు

ధర్మపురి, మార్చి 17: ధర్మపురిలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పవిత్ర గోదావరి నదీ తీరాన విరాజిల్లుతున్న ధర్మపురి క్షేత్రానికి పురాణ, ఇతిహాస, సాహిత్యపర ప్రాధాన్యం కలిగి ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. పూర్వం ధర్మవర్మ అనే మహారాజు పరిపాలించుట వలన ఈ క్షేత్రానికి ధర్మపురి అనే పేరు వచ్చింది. క్షేత్రంలో ప్రధానంగా లక్ష్మీనృసింహ స్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు, మసీదులు పక్కపక్కనే కలిగి అనాది నుంచి వైష్ణవ, శైవ, ముస్లిం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ క్షేత్రంలో బ్రహ్మదేవుడు, విష్ణుస్వరూపుడు అయిన నరసింహస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు ముగ్గురు కొలువు అయిన ఈ క్షేత్రాన్ని త్రిమూర్తి క్షేత్రమని కూడా పిలుస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలో యమధర్మ రాజు ఆలయం ఉంది. గోదావరి నదిలో స్నానం చేసిన అనతరం స్వామివారలను దర్శనం చేసుకోవటం ఇక్కడ ఆనవాయితీ. స్వామి వారలను దర్శించుకుంటే మానసిక, శారీరక, రుణ బాధలు తొలగి, ఆయురారోగ్య, అష్టఐశ్వర్యాలు ప్రసాదించుతారని భక్తులకు అపార నమ్మకం ఉంది. మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుని స్వామివారలను దర్శనం చేసుకుంటారు.

● బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమాలు..

ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో, సహాయ కమిషనర్ సంకటాల శ్రీనివాస్ తెలిపారు. మార్చి 20న బుధవారం ఏకాదశి రోజున యజ్ఞాచార్యుల ఆహ్వానం, కళశ, విశ్వక్సేన, వాసుదేవ, పుణ్యాహవచనం, బ్రహ్మ కలశ స్థాపన, అంకురార్పణ, వరహాతీర్థం, పుట్ట బంగారం తేవడం, 21న సాయంత్రం ఆరు గంటలకు స్వామివారల కల్యాణం, 22న రాత్రి లక్ష్మీనరసింహ స్వామి వారల ఊరేగింపు సేవ ఉంటుంది. మార్చి 23న రాత్రి వేంకటేశ్వర స్వామి వారల ఊరేగింపు సేవ, 24న బ్రహ్మ పుష్కరిణిలో యోగ నృసింహస్వామి తెప్పె, డోలోత్సవాలు, 25న బ్రహ్మ పుష్కరిణిలో ఉగ్ర లక్ష్మీ నృసింహ స్వామి తెప్పె, డోలోత్సవాలు ఉంటాయి. 26న బ్రహ్మపుష్కరిణిలో వేంకటేశ్వరస్వామి తెప్పె, డోలోత్సవాలు, సాయంత్ర లక్ష్మీనృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుంది. మార్చి 27న లక్ష్మీ నృసింహ స్వామి ఉత్తర దిగ్యాత్ర, రాత్రి ఎనిమిది గంటలకు భోగ మండప ఉత్సవం, తొమ్మిది గంటలకు వేద సదస్సు ఉంటుంది. మార్చి 28న వేంకటేశ్వర స్వామి, దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు, రాత్రి ఎనిమిది గంటలకు దీపోత్సవం, 29న పూర్ణాహుతి, రథోత్సవం, చక్రతీర్థం, రాత్రి తొమ్మిది గంటలకు లక్ష్మీనృసింహ స్వామి వారల పుష్పయాగం ఉంటుంది. 30న రాత్రి ఏడు గంటలకు వేంకటేశ్వర స్వామి పుష్పయాగం, రాత్రి తొమ్మిది గంటలకు యోగ లక్ష్మీనర్సింహస్వామి ఏకాంతోత్సం, 31న రాత్రి ఏడు గంటలకు కొత్త నరసింహస్వామి పుష్పయాగం, రాత్రి తొమ్మిది గంటలకు వేంకటేశ్వరస్వామి ఏకాంతోత్సవం, ఏప్రిల్ 1న రాత్రి తొమ్మిది గంటలకు కొత్త నారసింహ స్వామి ఏకాంతోత్సవాలు ఉంటాయి.

● ఆలయ పక్షాన ఏర్పాట్లు పూర్తి
- ఆలయ ఈవో శ్రీనివాస్



స్వామివారి బ్రహ్మోత్సవాల కోసం ఆలయం పక్షాన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాము. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో క్యూలైన్లు, చలువ పందిళ్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేశాము. ఆలయాలు, గోపురాలకు సున్నం, రంగులు వేయించి విద్యుత్ దీపాలతో అలంకరించాము. గోదావరి నది, స్నానఘట్టాల వద్ద పందిళ్లు, దుస్తుల మార్పిడి కోసం తాత్కాలిక గదులు ఏర్పాటు చేయించాము.

గల్ఫ్ పంపిస్తానని ఏజెంట్ మోసం

- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 17: గల్ఫ్ ఏజెంట్ మోసం చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. తమను మోసం చేసిన ఏజెంటుపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని ఆదివారం విలేకరులను వేడుకున్నారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని సింగారం, బండలింగంపల్లి, గొల్లపల్లి గ్రామాలకు చెందిన యువకులు రషీద్, ముఫీద్, ఆసీఫ్, ఇర్ఫాన్, సయ్యద్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నాలుగు నెలల కిందట ముంబాయిలోని ఏజెంట్ అక్తర్ పరిచయమయ్యాడు. రూ 1.50 లక్షలు చెల్లించాలని పేర్కొన్నాడు. ముందుగా రూ.ఒక్కొక్కరు రూ.80 వేలు ముట్టజెప్పాలని స్పష్టం చేశాడు. దీంతో ఐదుగురు యువకులు అప్పులు చేసి రూ.4లక్షలు అప్పజెప్పారు. పాస్‌పోర్టులు, డబ్బులు తీసుకున్నాడు. రెండు నెలలు గడుస్తున్నా వీసా పంపించకపోవడంతో సెల్‌ఫోనులో సంప్రదించారు. ఏజెంటు స్పందించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. 15 రోజుల కిందట సదరు ఏజెంటు యువకుల పాసుపోర్టులను కొరియర్ ద్వారా పంపడంతో తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బుల విషయంపై అడిగేందుకు సెల్‌ఫోనులో సంప్రదిస్తే స్పందన లేదని వాపోయారు. ముంబాయికి వెళ్లలేక.. ఏం చేయాలో తెలియక యువకులు ఆందోళన చెందుతున్నారు. ఏజెంట్ అక్తర్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని బాధిత యువకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాద మృతుడి గుర్తింపు



నారాయణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మార్చి 17: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో ఈ నెల 16న రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి ఎల్లారెడ్డిపేట వాసి మంద నారాయణ(53)గా ఆదివారం పోలీసులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని నారాయణ గత కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఇంటి వద్దనే కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తుండేవాడు. ఈ నెల 16న ఇంటిలో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించారు. తిమ్మాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని శవం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రిలో ఉందనే సమాచారంతో అక్కడకు వెళ్లి చూడగా తమ తండ్రి నారాయణ అని గుర్తించారు. తమ తండ్రి మరణానికి కారణమైన వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని మృతుడి కొడుకు శ్రీకాంత్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి భార్య చంద్రకళ, కూతురు స్వప్న, ఇద్దరు కొడుకు శ్రీకాంత్, ప్రశాంత్‌లు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ




రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు, కోడెమొక్కులు చెల్లించుకుంటున్న జడ్జి శ్రీలేఖ

వేములవాడ టౌన్, మార్చి 17 : దక్షిణకాశీ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్న ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. రాజన్నను దర్శించుకున్న అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా ఉండేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● రాజన్న సేవలు ప్రముఖులు..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు బొడ్ల శైలజ దర్శించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. సిరిసిల్ల జిల్లా అసిస్టెంట్ సెషన్‌జడ్జి శ్రీలేఖ ఆలయంలో ప్రత్యేకపూజలో పాల్గొని కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

భూ కబ్జా కేసులో మాజీ ఉపసర్పంచ్ అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 17: భూ కబ్జాకు పాల్పడిన కేసులో తంగళ్లపల్లి మండలకేంద్రం మాజీ ఉపసర్పంచ్ పెద్దూరు తిరుపతిని ఆదివారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మనగర్‌లోని వేముల కనక నారాయణ, రాజ్యలక్ష్మి, గాజుల లతకు చెందిన సర్వేనెంబర్ 247లోని భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని వారి భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయడానికి తిరుపతి భారీగా డబ్బులు డిమాండ్ చేశారని ఆయన తెలిపారు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదుచేయగా తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో తిరుపతిపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేయగా అనేక క్రిమినల్, అక్రమ డబ్బు వసూళ్లకు పాల్పడిన కేసుల్లో నిందితుడని తేలిందన్నారు. దీంతో తిరుపతిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు. భూ కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు డిమాండ్‌చేసే వారిపై ప్రజలు ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

తంగళ్లపల్లి ఎంపీటీసీ అంతయ్య..

భూ అక్రమణ కేసులో జిల్లాలోని తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోడి అంతయ్యను ఆదివారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తంగళ్లపల్లి మండలంలో మహిళ పేరుతో ఉన్న భూమిని ధరణి సమయంలో తంగళ్లపల్లి ఎంపీటీసీ కోడి అంతయ్య తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడన్నారు. భూమిని ఖాళీ చేయాలని భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కులం పేరుతో దూషించాడని బాధితురాలు గట్టుపల్లి భూమవ్వ తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఫిర్యాదు మేరకు అంతయ్యపై బెదిరింపులు, భూ ఆక్రమణ, అట్రాసిటీ కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

● ఆగి ఉన్న లారీ ఢీకొని ముగ్గురు..
● ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం



వేణుగోపాల్(ఫైల్)



శ్రీకాంత్ (ఫైల్)

కోరుట్ల రూరల్, మార్చి 17: జగిత్యాల, కరీంనగర్ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. కోరుట్ల మండలం వెంటాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు పట్టణానికి చెందిన బడికెల వేణుగోపాల్ (30) మల్యాల మండల ముత్యంపేట గ్రామానికి తన తండ్రితో 25 సంవత్సర క్రితం వచ్చి నివాసం ఉంటున్నాడు. వేణుగోపాల వృతిరిత్యా మేస్త్రీ పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో కొండగట్టు ప్రాంతంలో ఓ వ్యాపారి మెట్‌పల్లి పట్టణంలో తన కూతురు ఇల్లు నిర్మాణం పనులను వేణుగోపాల్‌కు అప్పగించాడు. నిర్మాణ పనులలో భాగంగా వేణుగోపాల్ ఆదివారం ఉదయం కొండగట్టు ప్రాంతానికి చెందిన పసులేటి శ్రీకాంత్ (23), కొమరం వెంకటేష్ (40) అనే కూలీలతో మెట్‌పల్లి పట్టణంలో ఇంటి పనులు చేసేందుకు ఒకే ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈక్రమంలో మండలంలోని వెంకటాపూర్ గ్రామశివారులో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ సంఘటనలో పసులేటి శ్రీకాంత్, కొమరం వెంకటేష్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా బడికెల వేణుగోపాల్ తీవ్ర గాయాలతో పడిపోయి ఉన్నాడు. గమనించి స్థానికులు విషయాన్ని కోరుట్ల పోలీసులతో పాటు 108 సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది వేణుగోపాల్‌ను చికిత్సనిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కోరుట్ల, మెడిపల్లి ఎస్‌ఐలు కిరణ్ కుమార్, శ్యాంప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. మృతదేహాలను కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పసులేటి శ్రీకాంత్‌కు ఇటీవల వివాహం జరుగగా భార్య శిరిషా గర్భవతిగా ఉంది. వేణుగోపాల్‌కు భార్య జ్యోతితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేష్‌కు భార్య సాయమ్మ తో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని రాజస్థాన్‌కు చెందిన వాహనంగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్‌బాబు పరిశీలించారు.

● ముత్యంపేటలో విషాదం..

మల్యాల: కోరుట్ల మండలం వెంకటాపూర్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్యంపేట, కొండగట్టుకు చెందిన ముగ్గురు దుర్మరణం చెందడం స్థానికంగా విషాదం నింపింది. ఓంగోలు ప్రాంతానికి చెందిన వేణు ఇళ్ల నిర్మాణ పనులకు గాను కొన్నేళ్ల క్రితం ముత్యంపేటకు వచ్చాడు. ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న అతను మెట్‌పల్లిలో జరిగే పనుల కోసం కొండగట్టుకు చెందిన శ్రీకాంత్, వెంకటేష్‌ను తీసుకెళుతుండగా జరిగిన ఈ ఘటనలో ముగ్గురూ మృతి చెందగా వేణు మృతదేహాన్ని తమ స్వగ్రామం ఒంగోలుకు తరలించారు. వేణుకు భార్య, ఐదేళ్లలోపు ఇద్దరు కొడుకులు ఉన్నారు. శ్రీకాంత్ మృతదేహానికి కుటుంబసభ్యులు కొండగట్టులో అంత్యక్రియలు నిర్వహించారు.

● కరీంనగర్ జిల్లాలో..

కరీంనగర్ క్రైం: కొత్తపల్లి మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొక్కెరకుంటకు చెందిన బత్తిని లక్ష్మిరాజం(60) తీవ్రగాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

లక్ష్మిరాజం ఉదయం పనిఉందని కొత్తపల్లికి వెళ్ళిన సమయంలో రోడ్డు పక్కన నడుస్తుండగా వెనుకవైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టి కొంతదూరం వరకు లాక్కెల్లిన ఆటో బోల్తాపడిందని తెలిపారు. దీంతో లక్ష్మిరాజంతోపాటు ఆటోలో ఉన్న నలుగురు వ్యక్తులకు గాయాలుకాగా అందరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో లక్ష్మిరాజం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు మూడు గేదెల మృతి



వల్బాపూర్‌లో మృతి చెందిన గేదె

వీణవంక, మార్చి 17: మండలంలోని వల్బాపూర్ గ్రామంలో ఆదివారం సాయత్రం పిడుగు పడడంతో గేదే మృతి చెందింది. గ్రామంలోని తాళ్లపల్లి శ్రీనివాస్‌కు చెందిన గేదేను ఇంటి ఆవరణలో చెట్టు కింద మేత మేస్తుండగా పిడుగు పాటుతో మృతి చెందినట్లు తెలిపారు. దాదపు యాభై వేల విలువచేసే గేదే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు.

గన్నేరువరం: మండలంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడి మండల కేంద్రానికి చెందిన రైతు బుర్ర రామంచంద్రం పాడి గేదె మృతి చెందింది. గేదె మృతితో సుమారు రూ.60 వేల నష్టవ వాటిల్లిందని, దీంతో జీవనోపాధి కోల్పోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

కాల్వ శ్రీరాంపూర్: పిడుగుపాటుతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పెరుగు ఐలు కొమురయ్యకు చెందిన పాడి గేదెను ఇంటి సమీపంలోని ఓ చెట్టు కట్టేశాడు. అకాల వర్షంతోపాటు చెట్టుపై పిడుగుపడి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ రూ.40వేలు ఉంటుందని బాధితులు వాపోయాడు.

మల్లారెడ్డిపేటలో ఒకరి ఆత్మహత్య

గంభీరావుపేట, మార్చి 17: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన కండెల దేవయ్య (46) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కండెల దేవయ్య శనివారం తన ఇంట్లో గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున దేవయ్య మృతి చెందాడు. సిద్దిపేటలో ఉన్న ప్లాటు రోడ్డు విస్తరణలో పోతుందనే బెంగతో దేవయ్య రోజూ బాధపడేవాడని మృతుడి భార్య మల్లవ్వ పోలీస్‌లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అయితే ప్లాటు కొనుగోలు సమయంలో చేసిన అప్పుతో పాటు పిల్లల చదువుల కోసం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపింది. ప్లాటు కోసం చేసిన అప్పే కట్టని పరిస్థితిలో ఆ ప్లాటే రోడ్డు విస్తరణలో పోతుందనడంతో మానసికంగా కృంగిపోయాడని వెల్లడించింది. అప్పుల ఒత్తిళ్లు, మరో వైపు ప్లాటు బెంగతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని దేవయ్య భార్య ఫిర్యాదు చేసింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



హరీష్ (ఫైల్)

ఇల్లందకుంట, మార్చి 17: మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి కంచం హరీష్ (28) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన నలుగురు ట్రాక్టర్ (మిల్లర్)పై జమ్మికుంటలో ఒకరి ఇంటికి స్లాబ్ పోసి ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ఇల్లందకుంట ఎస్‌బీఐ సమీపంలో రోడ్డుపై కంకర కుప్ప ఉండడంతో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కంకర కుప్ప ఎక్కడం వల్ల ఇంజన్ బోల్తా పడింది. దీంతో ఇంజన్‌పై కుర్చున్న కంచం హరీష్ ఎగిరిపడి కింద పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అరుణ్, సాంబయ్యకు తీవ్రగాయాలు కాగా, రాజయ్యకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయాలైన వారిని జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన హరీష్‌కు 9నెలల క్రితమే వివాహం జరిగింది. వీరందరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో కనగర్తి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్ మార్చి 17: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన పొన్నం శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి పడి గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తిరీత్యా శనివారం సాయంత్రం కల్లు గీసేందుకు వెళ్లగా తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో మోకు జారి శ్రీనివాస్ కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు గుర్తించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబసభ్యులు, గౌడ సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మాజీ తహసీల్దార్ ఇంట్లో సోదాలు



శ్రీనివాస్ ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మార్చి 17: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించిన కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను కస్టడీకి తీసుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు హైదరాబాద్‌లోని మాధాపూర్‌లో అతని ఇంటిలో ఆదివారం సోదాలు నిర్వహించారు. రెండురోజులు కస్టడీకి తీసుకున్న పోలీసులు మొదటి రోజు శనివారం కరీంనగర్‌లో ఇల్లు, గెస్ట్‌హౌజ్‌లో సోదాలు జరిపిన పోలీసులు పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మాధాపూర్‌కు తీసుకువెళ్లి అతని అపార్ట్‌మెంట్‌లో సోదాలు నిర్వహించామని, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పెగడపల్లి, మార్చి 17: మండలం లోని బతికెపల్లి గ్రామానికి చెందిన వడ్కాపురం భాస్కర్ (35) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు భాస్కర్ అప్పుల బాధ పెరగడంతో కుటుంబ పోషణ భారం అయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంటి పక్కనచ గల బాత్రూంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుని భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వెలవెలబోతున్న వరదకాలువ

● కాలువలో గుంతలు తవ్వుతున్న రైతులు
● బావుల్లో అడుగంటిన భూగర్భజలాలు
● అన్నదాతల 'వరి' గోస..

మల్యాల, మార్చి 17: వరదకాలువ నీటి ఆధారంగా సాగు చేసిన రైతులు నీరు తగ్గుముఖం పట్టడంతో ఆందోళన చెందుతున్నారు. చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకోవడం కోసం నానా పాట్లు పడుతున్నారు. మరి కొంత మంది రైతులు నీరందకపోతే పంటలు ఎండిపోతాయని ఆవేదన చెందుతున్నారు. మల్యాల మండలంలోని రాంపూర్ పంప్ హౌజ్ తరువాత గల నూకపల్లి క్రాస్ రెగ్యులేటర్ వద్ద నుంచి సర్వాపూర్ శివారు వరకు దాదాపు 3కి.మీ మేర కాలువలో నీరు లేక వెలవెలబోతుంది. ఈ కాలువ నీటి ఆధారంగానే వందల ఎకరాల్లో వరితో పాటు వివిధ పంటల సాగు చేస్తుండగా కాలువలో నీరు ఉంటే బావుల్లో నీరు పుష్కలంగా ఉండనున్నాయి. అయితే కాలువలో నీరు లేకపోవడంతో కాలువకు అమర్చుకున్న పంప్‌సెట్‌ల నుంచి నీరు అందక పంటలపై ప్రభావం చూపుతుంది. అలాగే బావుల్లోనూ నీరు అడుగంటి పోవడంతోనూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా నీరు అందుబాటులో ఉండగా ఈ సారి పరిస్థితులు భిన్నంగా ఉండడంతో అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. వరి పంట ప్రస్తుతం గొలకలు వేయగా మరో ఇరవై రోజుల్లో చేతికి రానుంది. దీంతో మరో కొద్ది రోజుల పాటు ఆయా పంటలకు నీరు తప్పనిసారి కావాల్సి ఉంది. అయితే వరదకాలువలో నీరు లేక వరి పంట ఎండిపోయే అవకాశం ఉందని కాలువ కింది గ్రామాలైన నూకపల్లి, మల్యాల, ముత్యంపేట, సర్వాపూర్, బల్వంతాపూర్ తదితర గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● కాలువలో గుంతల తవ్వకం

వరదకాలువలో నీరు లేకపోగా ఉన్న చోట రైతులు గుంతలు తవ్వుతున్నారు. చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకోవడానికి జేసీబీలతో గుంతలు తవ్విస్తున్నారు. మరి కొందరు పంప్‌సెట్‌లను నీరు ఉన్న చోట్లకు మార్చుకుంటున్నారు. వేలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. కొన్ని చోట్ల బావులను అద్దెకు తీసుకుంటున్నారు. వరదకాలువ నీటి ఊటల ఆధారంగా పంటలకు అందిస్తూ పడిగాపులు పడుతున్నారు.

● పంటలకు అందని నీరు

వరదకాలువ, వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వారం రోజులుగా పంటలకు సరిపడ నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగుతే ఎండిపోతాయని ఆందోళన చెందున్నారు. ఇప్పటికే పంట గొలకలు వచ్చాయని కనీసం మరో పది రోజుల పాటు నీరందిస్తే పంటలకు కొంత మేలు చేకూరుతుందని లేనిచో పూర్తిగా ఎండి ఇన్నాళ్ల చేసిన శ్రమ వృథా అయ్యే అవకాశం ఉందని అంటున్నారు.



నీరు లేక వెలవెలబోతున్న వరదకాలువ



వరదకాలువలో జేసీబీతో కాలువ తవ్వుతున్న రైతులు

● కాలువకు నీటిని విడుదల చేయాలి
చెలిమెల రాయలింగం, రైతు, నూకపల్లి



కాలువలో నీరు లేక పంటలు ఎండిపోయె పరిస్థితి ఏర్పడుతుంది. కాలువ ఆధారంగానే తాము పంటల సాగు చేపట్టాం. కాబట్టి వరద కాలు వకు కనీసం ఒక్క టీఎంసీ నీటిని విడుదల చేస్తే వందలాది ఎకరాల పం టలకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికే జేసీబీలతో గుంతలు తవ్వాల్సి వస్తుంది. నీటి విడుదల చేయాలని అధికారులను కోరిన ప్రయోజనం లేకుండా పోయింది.

● తొమ్మిది ఎకరాల్లో సాగు చేసిన
ఓలపు గంగాధర్, రైతు, నూకపల్లి



తనకున్న మూడు ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీ సుకొని వరి పంట సాగు చేస్తున్న. ఈ సాగుకు వరదకాలువ నుంచే నీటి ని అందిస్తున్న. కాలువలో నీరు లేకపోవడంతో పంట వాడిపోతుంది. కొద్ది రోజులు అయితే ఎండిపోనుంది. కాలువలో నీరు లేక బావుల్లోనూ నీరు అడుగంటి పోయాయి. దీంతో పంటలను కాపడుకోవడం తమకు ఆందో ళన కలిగిస్తుంది.

● పంటలను కాపాడుకునేందుకు పాట్లు
వంగల లచ్చిరెడ్డి, రైతు



చివరి దశకు వచ్చిన వరి పంటకు నీరందక పంట కాపడుకునేందుకు పాట్లు పడాల్సి వస్తుంది. వరదకాలువలో నీరు లేక నా రెండెకరాల పంట కు నీరందించడం లేదు. మరి కొద్ది రోజులు గడిస్తే తీవ్రంగా నష్టం జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు నీటిని వరదకాలువకు విడుదల చేయాలని కోరుతున్నారు.

● కాలువకు నీరు వచ్చే అవకాశం లేదు
తిరుపతి, డీఈ, ఎఫ్ఎఫ్‌సీ

వరదకాలువకు నీటిని అందించేంత ఎస్సారెస్పీలో నీటి లభ్యత లేకపో వడంతో కాలువకు నీరు వచ్చే అవకాశం లేదు. ఎస్సారెస్పీ నుంచి వరదకాలువకు నీటిని విడుదల చేసే గేట్ల కిందకు నీటి మట్టం చేరాయి. దీంతో నీటి విడుదల ఉండదు. రైతులు నిత్యం నీటిని విడుదల చేయాలని కోరుతున్నపట్టికీ ప్రస్తుతానికి ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది

వీధులను శుభ్రం చేసిన వలంటీర్లు



వీధులను ఊడుస్తున్న వలంటీర్లు

కొడిమ్యాల, మార్చి 17 : కొడిమ్యాలలోని ఇందిరానగర్ కాలనీలో కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవాపథకం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో బాగంగా ఆదివారం వలంటీర్లు వీదులను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలిగించారు. కాలనీలోని ప్రజలకు ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్. గోపీకృష్ణ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిపించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచు గడ్డం జీవన్‌రెడ్డి, గ్రామీణ కళాజ్యోతి అవార్డు గ్రహీత ఎం. రవీందర్, జాతీయ అవార్డు గ్రహీత యు. ఆదిత్య వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న యూత్ సభ్యులు

రాయికల్, మార్చి 17: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన యంగ్ స్టార్ యూత్ సభ్యులు ఇబ్రహీంపట్నం మండలంలోని మిచ్చమ్మ చారిటబుల్ ట్రస్ట్‌లోని 13 మంది విద్యార్థులకు రూ.13 వేల విలువ గల పాఠశాల యూనిఫాం, షూలు అందజేశారు. అనంతరం విద్యార్థులకు ఒక పూట భోజనాన్ని ఏర్పాటు చేసి తమ ఉదారభావాన్ని చాటుకున్నారు. నిరుపేద విద్యార్థులకు తమవంతు సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు పురాణం భవాని, ప్రధాన కార్యదర్శి టేకు రాజు, యూత్ సభ్యులు లక్ష్మణ్, చంటి, విజయ్, శ్రీను, కనకయ్య పాల్గొన్నారు.

కోరుట్ల పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

కోరుట్ల రూరల్, మార్చి 17 : నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల నియోజకవర్గం పోలీంగ్ బూత్‌ల ఏర్పాట్లును నియోజవర్గ రిటర్నింగ్ అధికారి అనంద్ కుమార్ ప్రకటించారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలతో పాటు ఇబ్రహీపట్నం, మల్లాపూర్, కోరుట్ల మండలం, మెట్‌పల్లి మండలాలలో పోలింగ్ కేంద్రాలను ప్రకటించిన ఎన్నికల రిటర్నింగ్ ఆధికారి ఓటర్ జాబితాను విడుదల చేశారు. పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలంలో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల చేతలు, వివిధ శాఖల నుండి ఎన్నికల కోసం విధులు నిర్వహిస్తున్న అధికారులతో సమావేశ ఏర్పాటు చేసి వాటి వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆనంద్ కుమార్ విడుదల చేశారు. ఇబ్రహీపట్నం మండలంలో 37, కోరుట్ల మండలంలో 35, కోరుట్ల మున్సిపల్ పరిధిలో 54, మల్లాపూర్ మండలంలో 50, మెట్‌పల్లి మండలంలో 47, మెట్‌పల్లి మున్సిపల్‌లో 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేకు విశ్వబ్రాహ్మణ సంఘం వినతి



ఎమ్మెల్యేను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

కథలాపూర్, మార్చి 17 : మండలంలోని అంబారిపేట విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆదివారం వేములవాడలో కలిసి సంఘ భవనానికి నిధులు కేటాయించాలని కోరినట్టు మాజీ ఎంపీటీసీ శ్రీరాముల ప్రకాశ్ తెలిపారు. అదేవిధంగా బ్రహ్మంగారి ఆలయం వద్ద బోరు ఏర్పాటుతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారని చెప్పారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేసిన వైశ్యులు

కొడిమ్యాల, మార్చి 17 : తెలంగాణ ప్రభుత్వం వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయటం పట్ల ఆదివారం మండల ఆర్యవైశ్యులు మండల కేంద్రంలోని అంగడి బజారులో గాంధీ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యంల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం, మంత్రి, ఎమ్మెల్సీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టుకు బండరాళ్లే రక్షణ!



కల్వర్టు పక్కన బండరాళ్లు

మల్యాల, మార్చి 17: మల్యాల నుంచి సర్వాపూర్ వెళ్లే మార్గంలో గల కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టుపై గోతులు ఏర్పాడ్డాయి. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు వచ్చిన వరదకు కల్వర్టు మరింత దెబ్బతిన్నది. దీంతో కల్వర్టు కూలిపోకుండా పెద్ద సైజు బండరాళ్లను కల్వర్టుకు రక్షణగా ఏర్పాటు చేసినట్లు స్థానిక రైతులు పేర్కొంటున్నారు. మరమ్మతులు చేయాలని, కొత్తది నిర్మించాలనే సర్వాపూర్, బల్వంతా పూర్ వాసుల విన్నపాలను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకో వడం లేదు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి, మార్చి, 17 : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ శనివారం మధ్యాహ్నం విడుదలైనందున కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుల్లో భాగంగా ఆదివారం ప్రభుత్వ స్థలాలలో ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేసి, బ్యానర్‌లు, వాల్ పోస్టర్లను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదలైనందున ఆదివారం మధ్యాహ్నం 3 గంటల్లోపు రాజకీయ ప్రకటనలు, కటౌట్లు తొలగించాలని ఆదేశించామన్నారు. ఎన్నికల షె డ్యూలు ప్రకటించనప్ప నుంచి 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లోను 48 గంటల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లోను అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాలని అధికారుల ఆదేశించారన్నారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్, ప్లెక్సీల ఏర్పాటు కోసం తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని, లేనియేడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సానిటరీ ఇన్‌చార్జి ఇన్స్‌పెక్టర్ రత్నాకర్, ముజీబ్, నరేష్, అశోక్ పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బడుగు బలహీన వర్గాలు కాంగ్రెస్ ఎంపీని గెలిపించండి

మల్లాపూర్, మార్చి, 17 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి బడుగు బలహీన వర్గాలు మద్దతు తెలిపి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ కౌన్సిలర్ యామ రాజయ్య, నాయకుడు ఎర్రోళ్ల హన్మండ్లు అన్నారు. ఆదివారం మండలంలోని ఓబులపూర్ గ్రామంలో వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం ఎంతగానో కృషి చేస్తున్న రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాముల లక్ష్మని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి మద్దతు తెలిపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొమిరెడ్డి కరంచంద్, నియోజకవర్గం పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావుల ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సబ్బండిగా ఉండి పార్టీ బలోపేతానికి మద్ధతు తెలపాలన్నారు. నాయకులు బోయిని హన్మాండ్లు, జావిడి రాజారెడ్డి, ముదిరాజ్ యువజన నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధుడికి అంత్యక్రియలు

కథలాపూర్, మార్చి 17 : మండలంలోని అంబారిపేటకు చెందిన మర్క చంద్రయ్య (65) అనే నిరుపేద అనాధ వృద్ధుడికి గ్రామస్థులు, యంగిస్థాన్, విజేత యువజన సంఘాలు అంత్యక్రియలు నిర్వహించారు. చంద్రయ్య గ్రామ శివారులోని ఓ పూరి గుడిసెలో కొంత కాలంగా జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందడంతో యువజన సంఘాలు, గ్రామస్థులు కలిసి అంత్యక్రియల కోసం సుమారు రు. 25 వేలు సేకరించి సాంప్రాదాయం ప్రకారం కార్యక్రమాలు పూర్తి చేశారు. గ్రామ శివారులో ఉన్న శ్మశానవాటికలో అంత్యక్రియలు చేశారు.

వేములవాడ ఏఎంసీ మాజీ చైర్మన్ జన్మదిన వేడుకలు

కథలాపూర్, మార్చి 17 : మండల కేంద్రంలో ఆదివారం వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు వర్దినేని నాగేశ్వర్‌రావు, గుండారపు సౌజన్యగంగాధర్, ఎంపీటీసీ మల్యాల రమేశ్, నల్ల గంగాధర్, దొప్పల జలంధర్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

స్తంభాన్ని ఢీ కొట్టి కారు బోల్తా..

తప్పిన ప్రమాదం

వెల్గటూర్, మార్చి 17: వెల్గటూర్ పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ కారు అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ క్రమంలో కారు బోల్తా కొట్టి ముందు భాగం నుజ్జయింది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం ఐదుగురు వ్యక్తులు కారులో ధర్మపురికి దైవ దర్శనం నిమిత్తం హైదరాబాద్ నుంచి వస్తున్నారు. పెద్ద వాగు సమీపంలో అదుపు తప్పి సమీపంలోని స్తంభాన్ని ఢీకొట్టింది.

ఈ సంఘటనలో ఎవరికీ ప్రాణ నష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మాల కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

భీమారం, మార్చి 17: మాల కులస్థులు ఆర్థిక సామాజిక అభివృద్ధి సాధించడానికి మాల ఉప కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం శుభ పరిణా మమని భీమారం మండల మాల మహానాడు అధ్యక్షుడు బక్కూరి నరేష్ అన్నారు. మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటైన పదేళ్లలో కేసీఆర్ రజాకార్ల పాలన సాగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో సామాజిక దిశగా అడుగులు పడుతున్నాయన్నారు.

దుబాయ్‌లో ఉన్న వ్యక్తిని స్వదేశానికి రప్పించాలని ఆదేశాలు జారీ

బీర్‌పూర్, మార్చి 17: మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన శీలం లింగయ్య ఉపాధి కోసం 28 ఏళ్ల క్రితం దుబాయ్ వెళ్లి అనారోగ్యంతో చికిత్స పొందుతూ కోమాలోనికి వెళ్లి కొంత కాలం తర్వాత బయట పడిన వ్యక్తిని స్వదేశానికి రప్పించాలని కోరుతూ టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశాడు. షాంద్ పాషా రాసిన లేఖకు సీఎంవో కార్యాలయం స్పందించి కోమాలో నుంచి బయట పడిన శీలం లింగయ్య అనే వ్యక్తికి పాసుపోర్టు జారీ చేయాలని పాసుపోర్టు కార్యాలయానికి ఆదేశాలు జారీచేశారు. దుబాయ్ నుంచి స్వదేశానికి రప్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో లింగయ్య 28 ఏళ్ల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్ళి అక్కడే ఉన్నాడు. దుబాయికి వెళ్లినప్పటి నుంచి ఆచూకి తెలియని స్థితిలో ఇంటికి ఫోన్ కూడా చేయ లేని కారణంగా లింగయ్య భార్య శీలం లక్ష్మీ ఆయన రాక కోసం ఎదురు చూస్తూ చివరికి ఆరోగ్యం క్షీణించి మంచం పట్టింది. పరిస్థితి విషమించి మృతి చెందింది. భార్య మృతి చెందిన విషయం బంధువుల ద్వారా తెలుసుకున్న లింగయ్య అక్కడి వారి సాయంతో కొడుకుతో ఫోన్‌లో మాట్లాడారు. స్వదేశానికి రావా లంటే ఇక్కడ వీసాకు జరిమానా కట్ట లేక పోతున్నానని కొడుకుతో బాధ పడుతూ చెప్పాడు. దీంతో లింగయ్య కొడుకు ఈ విషయాన్ని చాంద్ పాషాకు తెలిపాడు. చాంద్ పాషా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం లింగయ్యను స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చూడాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

కొడిమ్యాల, మార్చి 17 : మండలంలోని పూడూర్ గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పోచమ్మ బోనాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలో బ్రహ్మంగారి ఆలయ 13వ వార్షికోత్సవం, బ్రహ్మంగారి కల్యాణం పురస్కరించుకొని గ్రామంలోని విశ్వబ్రాహ్మణులు, పలువురు గ్రామ మహిళలు ఆదివారం ఇంటికొక్క బోనంతో బ్రహ్మంగారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం డప్పు చప్పుళ్లలతో పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం పోచమ్మకు బోనాలను సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తమ పిల్ల పాపలను, కుటుంబాలను చల్లగా చూడాలని గ్రామ దేవతను కోరుకున్నారు. సుమారు 200 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు తొగిటి కిరణ్, వెంకటాచారి, నర్సింహచారి, భాస్కరాచారి, శ్రీకాంత్ గౌరవ అధ్యక్షుడు రామస్వామి, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

●మండలంలోని పూడూర్ గ్రామంలో పోచమ్మ బోనాల పండగ ఆదివారం ఘనంగా జరిగింది. రేణుక ఎల్లమ్మ పట్నాల సందర్భంగా గ్రామంలోని గౌడ కులస్తులు, మహిళలు సుమారు బోనాలను నెత్తిన పెట్టుకొని ఆలయం వరకు డప్పుచప్పుళ్ళతో నృత్యాలు చేస్తు ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి పూజలు నైవేద్యాలను సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డమీది శ్రీనివాస్‌గౌడ్, జిల్లా నూతన సంఘం అధ్యక్షుడు పొల్లాల జలెందర్‌గౌడ్, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ లింగాగౌడ్, నాయకులు కుమార్‌గౌడ్, చల్లూరి వెంకటేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కుల సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఎండపల్లి: మండలంలోని ఎండపల్లి గ్రామంలో ఆదివారం నాడు గౌడసంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గౌడ కులస్తులు అందరూ ఇంటింటికి బోణం వండుకొని పోచమ్మ దేవస్థానానికి డప్పులతో, బైండ్లొల్లతో కలిసి దేవస్థానానికి చేరుకుని, దేవునికి నైవేద్యం సమర్పించారు. అనంతరం దేవుడికి మొక్కు చెల్లించుకుని ఇంటికి చేరుకున్నారు. రేణుక ఎల్లమ్మ పట్నాల సందర్భంగా మొదటి రోజున పోచమ్మ బోణాల కార్యక్రమం నిర్వహించి నట్టు గౌడ కులస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తోడేటి రాజయ్య గౌడ్, ఉపాధ్యక్షులు బొంగాని సత్తయ్య గౌడ్, కులస్తులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని చింతలపేట గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో నూతన విగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు వంటి తదితర పూజ కార్యక్రమాలను పురోహితులు జరిపారు. భక్తులు భక్తి శ్రద్ధలతో బెల్లంతో అన్న ప్రసాదంతో బోనం తయారు చేసుకున్నారు. బోనం భక్తులు నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పులతో పోతురాజుల నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. భక్తులు బోనంతో ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసి స్వామి వారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొ క్కులు చెల్లించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సోమవారం ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



చింతలపేటలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



ఎండపల్లి మండలంలో బోనాలతో వెళ్తున్న మహిళలు